క్లుప్తంగా

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. నేడు (గురువారం) విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల టీజీ ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట చేపట్టనున్నట్లు ఆశాఖ కార్మిక సంఘాల జిల్లా జేఏసీ చైర్మన్ తిప్పరాపు రాజు, కన్వీనర్ మోత్కూరి కోటి బుధవారం ప్రకటనలో తెలిపారు. మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హైడ్రా తరహా వ్యవస్థను విస్తరింపజేయాలి

కాటారం: హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో హైడ్రా వ్యవస్థను విస్తరింపజేసి కబ్జాకు గురైన చెరువులు, నాళాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథని చిరంజీవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చిరంజీవి మాట్లాడారు. కాటారం మండల కేంద్రంలో ఎర్రకుంట, తిమ్మన్నకుంటతో పాటు అనేక ప్రధాన చెరువులు కబ్జాకు గురై అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయని ఆరోపించారు. హైడ్రా మాదిరిగా వ్యవస్థను రూపొందించి కాటారంలో చెరువు భూముల రక్షణ, కబ్జాదారులపై చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. చెరువు, ప్రభుత్వ భూముల కబ్జాలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉందని చిరంజీవి అన్నారు.

యువకుడికి గాయాలు


గాయపడిన గణేశ్

కాటారం: జాతీయ రహదారి 353(సి)పై బుధవారం బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బయ్యారం గ్రామానికి చెందిన పసుల గణేశ్ తన స్నేహితుడికి సంబంధించిన కొత్త బైక్‌పై మహదేవపూర్ నుంచి కాటారం వైపుగా వస్తున్నాడు. ఇసుక లారీల కారణంగా రోడ్డు పాడైపోయి ఉండగా అది గమనించకపోవడంతో గణేశ్ బైక్ అదుపుతప్పి పడిపోయింది. దీంతో గణేశ్ తల, మొహంతోపాటు శరీరంపై పలు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన వాహనదారులు 108కి సమాచారం అందించగా చికిత్స నిమిత్తం భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పంపు బ్యాటరీ పేలి ఒకరికి గాయాలు

రేగొండ(కొత్తపల్లిగోరి): పంటకు పిచికారీ చేసే పంపు బ్యాటరీ పేలి ఒకరికి గాయాలైన ఘటన కొత్తపల్లిగోరి మండలంలోని కొనరావుపేటలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కొనరావుపేట గ్రామానికి చెందిన రొడ్డ ప్రసాద్ పంటకు మందు పిచికారీ చేయడం కోసం ఇంట్లో ఉన్న పంప్ చెక్ చేసేందుకు ఆన్ చేశాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా బ్యాటరీ పేలడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

బీజేపీ నాయకుడి మృతి

రేగొండ: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన రాయంచు సమ్మయ్య బుధవారం మరణించారు. 30 సంవత్సరాలుగా బీజేపీకి ఆయన ఎన్నో సేవలందించారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి, సిరికొండ బలరాం, మాజీ ఎంపీపీ బొచ్చు సమ్మయ్య, మాజీ సర్పంచ్ ఏడునూతుల నిషిధర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గాలిఫ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాజు తదితరులు సంతాపం తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన కౌలు రైతు మాదరి శ్రీనివాస్(42) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు తెలిపారు. ఆయన రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట వేసి వ్యవసాయం చేస్తున్నాడు. ఈక్రమంలో అప్పుల బాధ తాళలేకనా! లేదా కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడనేది తెలియాల్సి ఉంది.

పోలీసుల ఆధర్యంలో గ్రామసభ

ఏటూరునాగారం : మండలంలోని కోయగూడ ఎల్లాపూర్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజోద్దీన్ సమక్షంలో చేపట్టిన ఈ గ్రామసభలో పలువురు గ్రామస్తులు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఏటూరునాగారం, రామన్నగూడెం, రాంనగర్ మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా స్పందించిన సీఐ, ఎస్సైలు డిపో మేనేజర్‌తో మాట్లాడి వారంలోగా బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లు కిందికి ఉన్నాయని తెలుపగా ఏఈ అశోక్‌తో మాట్లాడి చెట్ల తొలగింపునకు చర్యలు చేపట్టారు. పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

వామ్మో వానరం


మండలకేంద్రంలో గుంపులుగా తిరుగుతున్న వానర సైన్యం

- కోతుల స్వైర విహారంతో ప్రజలు, వ్యాపారుల తీవ్ర ఇబ్బందులు
- నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

గణపురం : మండలంలో వానర సైన్యం బీభత్సం సృష్టిస్తోంది. కోతుల స్వైర విహారంతో ప్రజలు, చిరు వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే కోతుల భయంతో వణికోపోతున్నారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా ఇబ్బంది పడుతున్నారు. కోతులు గుంపులుగా తిరుగుతూ దాడులు చేసి గాయపరుస్తున్నాయి. గతంలో మండలకేంద్రంలో నార్ల సమ్మయ్య అనే వ్యక్తి ఇంట్లోకి చొరబడిన కోతులు అతనిపై దాడి చేయడంతో మృతి చెందాడు. ఉదయం వాకింగ్ వెళ్లే వారి నుంచి వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు చేతిలో కర్రలు పట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇళ్లలో కూరగాయల చెట్లు, పండ్ల చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. కిరాణం వ్యాపారులతోపాటు రోడ్ల మీద కూరగాయలు, పండ్ల వ్యాపారం చేసుకొనే వారి పరిస్థితి దారుణంగా మారింది. పొట్టకూటి కోసం చిరు వ్యాపారం చేసుకుంటుంటే కోతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రోజూ పండ్లు, కూరగాయలను కోతులు నోటకరుచుకుని, చేతుల్లో తీసుకెళ్తా తమకు నష్టం కలిగిస్తున్నాయని వాపోతున్నారు. కోతుల భయానికి తమ బండ్ల చుట్టూ చేపల వలలు, ఇనుప తీగలు కట్టుకున్నా.. ఏదో రకంగా ఎత్తుకెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి కోతుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, కోతును పట్టుకుని అటవీ ప్రాంతంలో వదలాలని ప్రజలు కోరుతున్నారు.


కోతుల భయంతో పండ్ల బండికి అడ్డుగా కట్టిన చేపల వల

పండ్లు తింటున్నాయి..



కోతులను ఊరికి దూరంగా తరలించాలి. పండ్లు అమ్ము తేనే మాకు కుటుంబం గడుస్తుంది. కోతులు గుంపులుగా వచ్చి పండ్లను ఎత్తుకెళ్తున్నాయి. దీంతో వ్యాపారంలో తీవ్రంగా నష్టం వస్తుంది. పాలకులు, అధికారులు కోతులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి.

– కాల్య రాణి, పండ్ల వ్యాపారి

బుద్ధారంలో రెండు ఇళ్లపై దాడి

- సామగ్రితోపాటు ఇళ్ల ధ్వంసం
- మంగళవారం అర్ధరాత్రి ఘటన


ఇంటిఆవరణలో పడేసిన సామగ్రి

గణపురం: గణపురం మండలంలోని బుద్ధారం గ్రామానికి చెందిన గంధం సమ్మయ్యకు ఇద్దరు భార్యలు కాగ పెద్ద భార్య కుమారులైన పరమేశ్, కుమారస్వామి ఇళ్లపై రెండో భార్య(పిన తల్లి) వెంకటలక్ష్మి, ఆమె కుమారుడు నాగరాజు బంధువులతో కలసి మంగళవారం రాత్రి దాడి చేసి ఇంట్లోని సామగ్రి, ఇళ్లను ధ్వంసం చేశారు. గణపురం ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం. ఆస్తి పంపకాల విషయంలో ఇరువురి కుటుంబాలకు గతం నుంచి గొడవలు జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 12.30 గంటల సమయంలో నాగరాజు బంధువులతో కలసి ఇళ్లపై దాడికి పాలప్డాడు. దాడి చేయడానికి వస్తున్నారన్న సమాచారంతో పరమేశ్, కుమారస్వామి కుటుంబ సభ్యులు వేరే చోట తల దాచుకున్నారని వివరించారు. దాడికి పాల్పడి ఇంట్లోని సామగ్రి ధ్వంసం చేయడంతోపాటు బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదు అపహరించినట్లు బాధితులు తమకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బంగారం, నగదు విలువ రూ.4,30,000 వరకు ఉంటుందని ఫిర్యాదులు పేర్కొన్నారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, దాడికి పాల్పడ్డ వారిలో 10మందిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాలు


పశువుకు టీకా వేస్తున్న పశువైద్యుడు

కాటారం: పశువైద్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కిష్టంపేట, గట్లకుంట, గుండ్రాత్‌పల్లి గ్రామాల్లో బుధవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కిష్టంపేటలో 35 ఆవులకు, గట్లకుంటలో 30 ఆవులకు, 10 గేదెలకు, గుండ్రాత్‌పల్లిలో 160 పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు రమేశ్, ధీరజ్, వంశీ, పశువైద్య సహాయకులు అక్రమ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

టేకుమట్ల: మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన గీన హరీశ్, సాల్లేటి రాములు ఇటీవల చలివాగులో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం బీఆర్‌ఎస్ మండల నాయకులు పరామర్శించి, ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని భరోసా కల్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఒరంగంటి సధాకర్, బిల్లకంటి ఉమేందర్‌రావు, గువ్వాడి లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి


పరిశీలిస్తున్న ఎంఈఓ కుమారస్వామి

మొగుళ్లపల్లి: ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక విద్యావనరుల కేంద్రంలో బుధవారం మేదరమెట్ల, పిడిసిల్ల, ముల్కలపల్లి, మొగుళ్లపల్లి విద్యార్థులు పాల్గొని సేవలను వినియోగించుకోగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. శారీరకవైకల్యం కలిగిన 18 సంవత్సరాలలోపు దివ్యాంగ విద్యార్థులకు ప్రతి బుధవారం ఫిజియోథెరపీ చికిత్స ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సేవలను మండలంలోని శారీరక వైకల్యం గల పిల్లలందరూ వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రమాదేవి, ఐఈఆర్పీలు సదయ్య, సురేందర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ చంద్రమౌళి, కంప్యూటర్ ఆపరేటర్ వేణు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు


రేగ కేశవరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంఈఓ రేగ కేశవరావు అన్నారు. బుధవారం మండలశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఇటీవల ఎంఈఓ బాధ్యతలను స్వీకరించిన రేగ కేశవరావును సంఘం నాయకులు, ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈఓ కేశవరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని తెలిపారు. పాఠశాల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన ఉపాధ్యాయులకు గుర్తించి లభిస్తుందన్నారు. అనంతరం యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుతారి పాపారావు, ప్రధాన కార్యదర్శి అలెం భాస్కర్ మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని పెండింగ్ లో ఉన్నటువంటి డి ఏ లను ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంల సంఘ బాధ్యులు పొలిశ సమ్మయ్య గుమ్మడి ప్రభాకర్, రజిత శంకర్ చంద్రారెడ్డి లక్ష్మయ్య రవికుమార్ రాజేష్, బాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మూడు రోజుల తర్వాత వెలుగులోకి


సవాయ్‌సింగ్ (ఫైల్)

కాటారం: ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మూడు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. పోలీసులు, మృతుడి సోదరుడు లక్ష్మణ్‌సింగ్ కథనం ప్రకారం రాజస్థాన్‌లోని బెగవాస్‌కు చెందిన సవాయ్‌సింగ్(29) మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో స్వీట్‌హౌస్ నడుపుతున్నాడు. సవాయ్‌సింగ్‌కు భార్య దేవుకన్వార్, కూతురు ఉండగా వారు రాజస్థాన్‌లోని స్వగ్రామంలో ఉంటున్నారు. ఈ నెల 13న సవాయ్‌సింగ్ తన ద్విచక్రవాహనంపై కాటారం వచ్చి తిరిగి కాళేశ్వరం వెళ్లలేదు. దీంతో సోదరుడు లక్ష్మణ్‌సింగ్ తెలిసిన వారి వద్ద ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. ఈ నెల 15న కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా కాటారం మండలం నస్తూర్‌పల్లి అటవీ ప్రాంతంలో బైక్‌తో పాటు ఓ కుళ్లిన మృతదేహం ఉన్నట్లు గుర్తించిన పలువురు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్వీట్‌హౌస్ యజమాని ఆనవాళ్లు ఉండడంతో బంధువులకు సమాచారం చేరవేయగా వారు చేరుకొని సవాయ్‌సింగ్ మృతదేహంగా నిర్ధారించారు. రాత్రి సమయంలో బైక్‌పై కాళేశ్వరం వెళ్తున్న సవాయ్‌సింగ్ అతివేగంతో అదుపుతప్పి రోడ్డుపక్కన గల కందకంలో పడిపోవడంతో తీవ్రగాయాలపాలై మృతి చెందినట్లు మృతుడి సోదరుడు అనుమానం వ్యక్తం చేశారు. ఎవరూ గమనించకపోవడంతో మృతదేహం కుళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వివరాలు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు లక్ష్మణ్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పాత్రపురంలో బుధవారం సీఐ బండారు కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేశారు. వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ పత్రాలను పరిశీలించారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. వాహనదారులకు తగిన సూచనలు, సలహాలు చేశారు.

గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ జయప్రద

చిట్యాల: గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఐసీపీఎస్ కోఆర్డినేటర్ తిరుపతి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని భీష్మనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రోత్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐసీపీఎస్ కో–ఆర్డినేటర్ తిరుపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ప్రతి రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేయాలన్నారు. ప్రతి మహిళ మీసేవ ద్వారా లేబర్ కార్డు తీసుకోవాలని తెలిపారు. లేబర్‌కార్డుతో కుటుంబంలోని ఆడ పిల్లలకు పెళ్లి, డెలివరీ, రెండు కాన్పుల వరకు రూ.30వేల చొప్పున వస్తాయని అన్నారు. 18సంవత్సరాలు నిండే వరకు ఆడపిల్లలకు పెళ్లి చేయొద్దని తెలిపారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుజాత, హెల్త్ సూపర్‌వైజర్ సంజీవరెడ్డి, స్కూల్ టీచర్ కల్యాణి, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపూర్‌లో వైద్యశిబిరం


గోపాలపూర్‌లో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చిట్యాల: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు అపోలో, ఎన్ఎస్ఆర్ సౌజన్యంతో మండలంలోని గోపాలపూర్ గ్రామంలో బుధవారం మెగా వైద్యశిబిరం నిర్వహించినట్లు క్యాంప్ ఇన్‌చార్జ్ సుమన్‌రావు తెలిపారు. గ్రామంలోని ప్రజలకు ఈసీజీ, బీపీ, షుగర్, రక్త పరీక్షలతోపాటు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ ఏకు రవీందర్, నీల మహేందర్, ఏకుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు


చక్కెర పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల, కాపురం, మల్లారం, గ్రామాలలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ.. 8 లీటర్ల నాటు సారా, 20 కిలోల చక్కెర స్వాధీనం చేసుకొని, 600 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేసి, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా గుడుంబా అమ్మినా.. తయారు చేసినా.. రవాణా చేసినా.. చట్ట ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ దాడుల్లో కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య, సిబ్బంది రామ్‌చందర్, కోటేశ్వర్, వెంకటరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలి


ఓటరు నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు

టేకుమట్ల: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంతోపాటు మండలంలోని వెలిశాల, గర్మిళ్లపల్లి పాఠశాలల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు 2018 నవంబర్ నుంచి 2024 నవంబర్ వరకు ఆరు సంవత్సరాలలో కనీసం మూడు సంవత్సరాలు ఉన్నత పాఠశాలలో బోధించి ఉండాలని తెలిపారు. వారు 6వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు విలువైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహ్మద్ హకీం, పప్పుల సునీల్, జిల్లా కార్యవర్గ సభ్యులు మహేందర్, ప్రసాద్ మియాపురం జగన్నాథం, ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ నియామకం

కాళేశ్వరం: మహాదేవపూర్ మండల కేంద్రంలో జాతీయ మానవ హక్కుల మండలి(ఎన్‌హెచ్‌ఆర్ సీ ఎన్‌జీఓ) మండల కమిటీని నూతనంగా బుధవారం ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ ఆవరణలో జాతీయ అధ్యక్షుడు అయిలినేని శ్రీనివాసరావు సూచనల మేరకు మండల కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా కమిటీ సభ్యుడు కొరిపెల్లి ప్రశాంత్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా సుంకె మధు, ప్రధాన కార్యదర్శిగా గోగుల నాగేందర్, ఉపాధ్యక్షుడిగా మెరుగు నరసింహస్వామితోపాటు కమిటీ సభ్యులుగా మోతే సాంబయ్య, తూడిచెర్ల దుర్గయ్య, పత్తి మల్లేశ్, తాండ్ర వెంకటరమణ, మోటం వెంకటేశ్వర్లు, వెన్నంపల్లి మహేశ్, కారెంగుల బాపురావును నియమించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం ఆర్గనైజర్ సెక్రటరీ లింగాల రామయ్య, మండల అధ్యక్షుడు మెరుగు లక్ష్మణ్, ఇమ్మడిశెట్టి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘నూతన’ ఉత్సాహంతో పనిచేయాలి



మొగుళ్లపల్లి: నూతన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్లను అందజేస్తున్న ఎంఈఓ, కాటారం: ఎంఈఓను కలిసిన నూతన ఉపాధ్యాయులు

- విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: విధుల్లో చేరిన ఉపాధ్యాయులు నూతన ఉత్సాహంతో పనిచేసి విద్యార్థుల ప్రతిభను వెలికి తీయాలని ఎంఈఓ లింగాల కుమారస్వామి అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలకు కేటాయించిన తొమ్మిది మంది ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ లింగాల కుమారస్వామి జాయినింగ్ ఆర్డర్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. పోతుగల్లు, చింతలపల్లి, మెట్టుపల్లి పాఠశాలలకు ఒకరు చొప్పున తెలుగు పండిట్లు, ముల్కలపల్లి, పెద్దకోమటిపల్లి, పాత ఇస్సిపేట, వేములపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకరు చొప్పున, మెట్టుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఇద్దరు చొప్పున సెకండరీ గ్రేడ్ టీచర్లు జాయిన్ అయ్యారని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో అరెల్లి చంద్రమౌళి, తోకల వేణు, గడ్డం రాములు, గంపల అనిల్ కుమార్, బట్టల సదయ్య, పాశిగంటి సురేందర్, చెక్క రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కాటారం: డీఎస్సీ –2024లో నియామకమైన నూతన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో బుధవారం విధుల్లో చేరారు. కాటారం మండలానికి ఐదుగురు ఎస్జీటీలు, ఒక స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్, ఒక స్కూల్ అసిస్టెంట్ సోషల్, ఇద్దరు పీఈటీలను కేటాయించగా ఆయా పాఠశాలల్లో తమ జాయినింగ్ రిపోర్ట్‌లు అందజేశారు. అంకుషాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఇద్దరు ఎస్జీటీలు, అల్లీపూర్, కాటారం, దంతాలపల్లి ఎంపీపీఎస్‌కు ఒక్కో ఎస్జీటీ, విలాసాగర్ ఎంపీపీఎస్‌కు స్కూల్ అసిస్టెంట్ సోషల్, జాదారావుపేట ఎంపీపీఎస్‌కు స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్ దేవరాంపల్లి, చింతకానికి ఒక్కో పీఈటీ ఉపాధ్యాయులు నూతనంగా వచ్చినట్లు ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ఎంఈఓను కలిశారు.

చిట్యాల: నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు విధుల్లోకి చేరినట్లు చిట్యాల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి బుధవారం తెలిపారు. తుమ్మ మౌనిక, సుంకరి మౌనిక, ఎం.కావ్య, జె.శ్రీనివాస్, మెరుగు శిరీష, జి.ప్రశాంత్ కుమార్, కె.శిరీష, ముల్కనూరి భవాని, టి.సుధాకర్ నూతనంగా విధుల్లోకి చేరినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా నూతన ఉపాధ్యాయులకు ఎంఈఓ రఘుపతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి సూదం సాంబమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు

ములుగు: బ్యాంకుల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌రావు, రెండవ ఎస్సై రామకృష్ణ సూచించారు. పలు బ్యాంకుల్లో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ఖాతాదారులను అటెన్షన్ డైవర్షన్ చేస్తూ దొంగతనం చేసే ముఠా సంచరిస్తుందనే అనుమానంతో బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, కెనరా, యూనియన్ బ్యాంకు, ఏపీజీవీబీ, మహారాష్ట్ర బ్యాంక్, జంగాలపల్లిలోని యూనియన్ బ్యాంక్, మల్లంపల్లి ఎస్బీఐ బ్రాంచ్‌లను సందర్శించి బ్యాంకు అధికారులు, ఖాతాదారులకు సలహాలు, సూచనలు చేశారు.